# ఎమ్మెల్యే వస్తున్నాడని..

- క్యాంపు కార్యాలయం ముందు రహదారిపై నీటి తొలగింపు
- పట్టణంలో పారిశుధ్యం లోపించినా పట్టించుకోని వైనం



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు రోడ్డుపై నిలిచిన నీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చెన్నూర్ రూరల్, ఆగస్టు 28 : పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బుధవారం ఎమ్మెల్యే గడ్డం వివేక్ వస్తున్నారని సమాచారం రాగా, మున్సిపల్ సిబ్బంది ఆగమేఘాల మీద రహదారిపైనున్న నీటిని తొలగించారు. పట్టణంలో ఎక్కడ చూసినా పారిశుధ్యం లోపించి అపరిశుభ్రంగా మారినా పట్టించుకోని అధికారులు, ఎమ్మెల్యే వస్తున్నారని క్యాంపు కార్యాలయం ముందున్న నీటిని తొలగించారని, అదే చెన్నూర్‌లో పారిశుధ్యంపై దృష్టి పెట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 28 : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉంటూ, వారి కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం రామగుండంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పని చేస్తున్న ఎస్‌ఐలకు టాక్టికల్, ఫీల్డ్ క్రాఫ్ట్, మ్యాపింగ్‌పై బుధవారం ఆర్మ్‌డ్ రిజర్వుడు అధికారులతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. విపత్కర పరిస్థితుల్లో శత్రుమూకలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, మావోయిస్టు కార్యకలాపాలు నిరోధించేందుకు పలు సూచనలు అందించారు. సీపీ మాట్లాడుతూ ఫిజికల్ ఫిట్‌నెస్, ఆయుధ వినియోగం, అంబుష్, వెహికల్ అంబుష్ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

# యూనివర్సల్ బ్యాంకుకు రూ.76.35 లక్షల లాభం

**చైర్మన్ వినయ్‌కుమార్**

మంచిర్యాల (ఏసీసీ), ఆగస్టు 28 : యూనివర్సల్ కో ఆపరేటివ్ బ్యాంకుకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.76.35 లక్షల లాభం వచ్చిందని చైర్మన్ వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో బ్యాంకు 46వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరానికిగాను వాటాదారులకు 11 శాతం డివిడెంట్ ప్రకటించినట్లు పేర్కొన్నారు. మంచిర్యాల, సీసీసీలలో ఏటీఎం సౌకర్యం కల్పించామని, సీనియర్ సిటిజన్లకు ఇతర బ్యాంకులతో పోలిస్తే డిపాజిట్లపై అధికంగా వడ్డీ ఇస్తున్నామని, వారు బ్యాంకుకు రాలేని పరిస్థితుల్లో ఇంటికెళ్లి సర్వీసు చేస్తామని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సహకార అధికారి బీ సంజీవరెడ్డి బ్యాంకు సాధించిన ప్రగతిని ప్రశంసించారు. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరారు. బ్యాంకు ఇన్‌చార్జి సీఈవో కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ యూనివర్సల్ కో ఆపరేటివ్ బ్యాంకు చిన్న, మధ్య తరగతి ప్రజలకు రుణ సదుపాయం కల్పిస్తూ, వారి ఆర్థిక ప్రగతికి తోడ్పడుతుందన్నారు. అలాగే బ్యాంకు నుంచి రూపే డెబిట్ కార్డు, క్యూఆర్ స్కానర్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో బ్యాంకు బ్రాంచీలను నెలకొల్పుతామని పేర్కొన్నారు. బ్యాంకు ప్రగతికి సహాయ సహకారాలు అందిస్తున్న వాటాదారులు, ఖాతాదారులు, రిజర్వ్ బ్యాంకు, సహకార శాఖ, మున్సిపల్ అధికారులు, బ్యాంకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ జీ పూర్ణచంద్రరావు, డైరెక్టర్లు కేఎస్ఎం రావు, కృష్ణమూర్తి, శ్రీదేవి, బక్కయ్య, ప్రసాదరావు, రాజలింగు, భానుప్రకాశ్, రత్నం, సుశీల భాగ్యలక్ష్మి, ఆదిత్య, శ్రీపతి శ్రీనివాస్, వాటాదారులు, తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న యూనివర్సల్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ వినయ్‌కుమార్



లక్షెట్టిపేటలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల



లక్షెట్టిపేట పాఠశాలను తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

# గిరి సంక్షేమశాఖలో బదిలీలలు

## మంచిర్యాల జిల్లాలోనే తిష్టవేసిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, ఇతర అధికారులు

- బదిలీపై వెళ్లని వారిపై చర్యలు తీసుకోకుండా రిలీవర్స్ రాలేదంటూ బుకాయింపు
- ఐటీడీఏ పీవోనే తప్పుతోవ పట్టిస్తున్న జిల్లా అధికారులు...?
- గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాలనే తుంగలోకి తొక్కుతున్న వైనం
- లక్షెట్టిపేట పాఠశాలలను పీవో తనిఖీ చేయడంతో బయటపడ్డ అసలు విషయం
- పొంతన లేని సమాధానాలు చెబుతున్న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు
- స్థాన చలనం విషయంలో ముడుపులు తీసుకుంటున్నారంటూ అర్హుల ఆరోపణలు

మంచిర్యాల, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : జిల్లా గిరిజన సంక్షేమ శాఖ బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు తెలుస్తున్నది. ఇటీవల రాష్ట్రప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో జోన్-1లో పని చేసే గ్రేడ్-1, గ్రేడ్-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల(వార్డెన్)లను బదిలీ చేశారు. జోన్-1లో మొత్తం 12 మంది బదిలీ కాగా, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హాస్టల్‌లో పని చేసే వార్డెన్ లక్షెట్టిపేట గర్ల్స్ హాస్టల్‌కు, మంచిర్యాల పోస్ట్ మెట్రిక్ ఎస్టీ గర్ల్స్ హాస్టల్‌లో పని చేసే వార్డెన్ జన్నారం బాయ్స్ హాస్టల్‌కు బదిలీ అయ్యారు. గత నెల జూలై 21న బదిలీపై వెళ్లి అక్కడి హాస్టళ్లలో జాయిన్ అయిన వార్డెన్‌లు నెల రోజులు మంచిర్యాలలోని పాత హాస్టళ్లలోనే పని చేస్తున్నారు. ఈ విషయంపై మంగళవారం ఉదయం 'నమస్తే తెలంగాణ' జిల్లా గిరిజన సంక్షేమ అధికారి గంగారాంను వివరణ కోరగా.. క్లాస్-4 ఉద్యోగులకు మంచిర్యాలలోని హాస్టళ్లలో పోస్టింగ్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా సూచనల మేరకు వీరిని పాత హాస్టళ్లలోనే కొనసాగిస్తున్నామన్నారు. వీరి స్థానంలో రిలీవర్స్ రాగానే బదిలీపై వెళ్తారని, రెండు మూడు రోజుల్లో ఆదేశాలు రావొచ్చని చెప్పారు.

కాగా, ఇదే మంగళవారం లక్షెట్టిపేట గర్ల్స్ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన పీవో ఖుష్బూగుప్తా మాత్రం వార్డెన్ విధుల్లో లేకపోవడంపై మండిపడ్డారు. గత నెల 21న జాయిన్ అయిన వార్డెన్ నెలరోజులకు పైగా విధులకు రాకుండా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇక్కడే అసలు విషయం బయటపడింది. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి గంగారం చెప్పినట్లు బదిలీపై వెళ్లని వార్డెన్‌ల విషయం ఐటీడీఏ పీవో దృష్టిలో ఉంటే.. ఎందుకు సీరియస్ అయ్యారు. వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు ఎందుకు ఇచ్చారనేది అర్థం కావడం లేదు. బదిలీపై వెళ్లని వార్డెన్‌ల విషయంలో సమాచారం ఇవ్వకుండా ఐటీడీఏ పీవోను జిల్లా అధికారులు తప్పుదోవ పట్టించినట్లు దీనిని బట్టే అర్థం అవుతున్నది.



గర్ల్స్ హాస్టల్‌లో విధుల్లో చేరిన వార్డెన్ మల్లారెడ్డి

### అర్హులకు అన్యాయం..

ప్రస్తుతం బదిలీపై వెళ్లిన హాస్టల్ వెల్ఫేర్ అధికారుల స్థానంలో అర్హులైన క్లాస్-4 ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వాలి. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి గతంలోనే స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. కానీ ఇవేవీ మంచిర్యాల జిల్లా అధికారులకు పట్టలేదు. ఇప్పుడు బదిలీలైనా మంచిర్యాల గర్ల్స్ హాస్టల్, పోస్ట్ మెట్రిక్ ఎస్టీ గర్ల్స్ హాస్టల్ సహా ఇంటిగ్రేటెడ్ బాయ్స్ హాస్టల్‌లో మూడు ఖాళీలున్నాయి. ఈ మేరకు జిల్లాలో అర్హులైన క్లాస్-4 ఉద్యోగులు సైతం అందుబాటులో ఉన్నారు. వారికి పోస్టింగ్ ఇస్తే ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పనైపోయేది. కానీ క్లాస్-4 ఎంప్లాయీస్‌కు పోస్టింగ్‌లు ఇవ్వకుండా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారి ఒకరు అడ్డుకుంటున్నారని అర్హులైన ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. అర్హులైన తమను కాదని ఉపాధ్యాయులకు ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇవ్వాలంటూ సదరు అధికారి ఐటీడీఏ పీవోకు నోట్‌ఫైల్ పెట్టారని, ఈ మేరకు సదరు ఉపాధ్యాయుల నుంచి లక్షలాది రూపాయలు చేతులు మారాయని ఆరోపిస్తున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పని చేయాల్సిన అధికారులు వార్డెన్ పోస్టు కోసం అంతగా పైరవీలు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది. పిల్లలకు పాఠాలు చెప్పడం కన్నా.. లక్షలాది రూపాయలు లంచాలు ఇచ్చి వార్డెన్ పోస్టు అడగాల్సిన ఖర్మ ఏమిటనేది తెలియడం లేదు. ఇది ఈ ఇద్దరు వార్డెన్‌ల విషయంలోనే కాదు.. గిరిజన సంక్షేమ శాఖలో పని చేసే ఓ అధికారికి నిర్మల్‌కు బదిలీ అయ్యింది. అక్కడికి వెళ్లి జాయిన్ అయి వచ్చిన ఆయన సైతం ప్రస్తుతం మంచిర్యాలలోనే పని చేస్తున్నారు. జీతం మాత్రం నిర్మల్‌లో తీసుకుంటున్నారు. దీనిపై సదరు అధికారిని వివరణ కోరగా.. పీవో డిప్యూటేషన్ ఇచ్చారని చెప్పారు. దానికి సంబంధించిన కాపీని ఇవ్వాలని అడిగితే మాత్రం.. అలాంటివేవీ లేవని చెప్పారు. మరి ఈ అధికారి విషయమైనా పీవో దృష్టిలో ఉందా లేకపోతే ఇది కూడా అబద్ధమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పని చేసే కొందరు ఉపాధ్యాయులు సైతం పోస్టింగ్ ఒక దగ్గర ఉంటే.. పని మరో దగ్గర చేస్తున్నట్లు తెలిసింది. చెన్నూర్‌లో పోస్టింగ్ ఉన్న ఓ ఉపాధ్యాయుడు నెన్నెల మండలం కృష్ణపల్లిలో పని చేస్తున్నారు. ఇలా ఈ శాఖలో చాలా మంది అధికారులు బదిలీపై వెళ్లకుండా ప్రస్తుతం పని చేస్తున్న స్థానాల్లోనే తిష్ట వేసుకొని ఉన్నారని తెలుస్తున్నది.

### లక్షెట్టిపేటలో విధుల్లో చేరిన వార్డెన్..

ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా మంగళవారం లక్షెట్టిపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసి, విధులకు రాని వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయంలో పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో అక్కడ జాయిన్ అయి వచ్చి మంచిర్యాలలో పాత హాస్టల్‌లోనే పని చేస్తున్న వార్డెన్ మల్లారెడ్డి బుధవారం హుడావుడిగా వెళ్లి లక్షెట్టిపేట హాస్టల్‌లో విధుల్లో చేరారు. దీంతో రిలీవర్ వచ్చే వరకు మంచిర్యాలలోనే పని చేసేందుకు పీవో అనుమతి ఇచ్చారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి చెప్పినవన్నీ అబద్ధాలని తేటతెల్లమైపోయింది. ఇదే విషయమై వివరణ అడిగేందుకు 'నమస్తే తెలంగాణ' ఆయనను సంప్రదించగా.. ఐటీడీవో పీవోకు అర్హుల జాబితా పంపిస్తున్నామని, అందులో నుంచి మేడమ్ సెలెక్ట్ చేస్తారని మరో సమాధానం చెప్పారు. మంగళవారం ఆయన చెప్పిన సమాధానానికి, బుధవారం ఆయన చెప్పిన దానికి ఎక్కడా పొంతన కనిపించలేదు. వార్డెన్‌లు బదిలీపై వెళ్లకుండా మంచిర్యాలలోనే పని చేస్తున్న విషయం పీవో దృష్టిలో ఉంటే.. ఎందుకు పోకాజ్ నోటీసులు ఇచ్చారని అడిగేందుకు మరోసారి సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన ఫోన్‌లో ఆన్సర్ చేయలేదు. మరి ఇప్పటికైనా ఐటీడీఏ పీవో, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటారా.. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటారా.. అర్హులైన క్లాస్-4 ఉద్యోగులకు న్యాయం చేస్తారా... లేకపోతే సదరు జిల్లా అధికారి ఇచ్చిన జాబితాలోనే ఉపాధ్యాయులకే ఇన్‌చార్జి వార్డెన్ బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంటారా.. అన్నది వేచి చూడాల్సి ఉంది.

# వైద్య కళాశాల నిర్మాణం త్వరగా పూర్తవ్వాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి తుకారాం, ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ చెన్నకేశవులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం జిల్లాకు కేటాయించిన ప్రభుత్వ వైద్య కళాశాల భవనాలను వేగంగా పూర్తి చేసేలా అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వసతి గృహంలో 100 మంది విద్యార్థినులకు సరిపడా వసతులు కల్పించాలన్నారు. అన్ని అంతస్తుల్లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు ఉండేలా పర్యవేక్షించాలని కళాశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# రెగ్యులర్ చేయాల్సిందే

- సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్
- ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ర్యాలీ
- కలెక్టరేట్ ఎదుట ధర్నా
- రేవంత్ సర్కారుపై ఆగ్రహం

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : తమను రెగ్యుల్ చేయాలంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తమను వెంటనే రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు, టీపీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ మద్దతు పలికారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేశ్, నాయకులు దేవేందర్, మహేశ్వర్, సత్యనారాయణ, రాజేశ్, జిల్లా నాయకులు గెడేకార్ సంతోష్, సోను, సందీప్, రాము, సుభాష్, పీటీఐ రమేశ్, దేవన్న, రాజేశ్ ఉన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సమగ్ర‌శిక్ష ఉద్యోగులు



చెన్నూర్ రూరల్ : రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్



కోటపల్లి : సర్వాయిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినితో చదివిస్తున్న కలెక్టర్

# నాణ్యమైన విద్యనందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్
- కోటపల్లి మండలంలో ఆకస్మిక పర్యటన

కోటపల్లి, ఆగస్టు 28 : ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్ది నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం సర్వాయిపేట ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలను అడిగి.. వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ అంకితభావంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలలకు గుర్తింపును తీసుకురావాలన్నారు. విద్యార్థుల గైర్హాజరు తగ్గించాలని, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. అనంతరం సర్వాయిపేట, ఎసన్వాయి, ఎడగట్ట గ్రామాల్లో పర్యటించిన పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. నీటి లీకేజీలను అరికట్టాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం కోటపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ విద్యాబోధన, పాఠశాలలోని వసతులపై ఆరా తీశారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణలో భోజనం వండాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు. పాఠశాల ప్రత్యేకాధికారిణి హరితతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీడీవో ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శంకర్, తాజుద్దీన్, సంతోష్, టైపిస్ట్ శివనాగ సాత్విక్ ఉన్నారు.

### మెరుగైన వైద్యమందించాలి

చెన్నూర్ రూరల్, ఆగస్టు 28 : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం చెన్నూర్‌లోని ప్రభుత్వ దావఖానను ఆయన తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సేవల గురించి అడిగారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా సోకిన రోగులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి చికిత్స అందించాలని వైద్యులు సత్యనారాయణకు సూచించారు. దావఖాన పరిసరాలతో పాటు రోగుల వార్డుల్లో శుభ్రత పాటించాలని ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఓపీ రిజిష్ట్రర్లు, వైద్యుల హాజరు పట్టికలను పరిశీలించారు. రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




జన్నారం ఇందన్‌పెల్లి రేంజ్ అడవుల్లో అధికారులతో కలసి ట్రైనీ ఎఫ్ఆర్వోలు

# కవ్వాల్‌లో ట్రైనీ ఎఫ్ఆర్వోల పర్యటన

జన్నారం, ఆగస్టు 28 : జన్నారం కవ్వాల్ టైగర్ రిజర్వుడ్‌లోని ఇందన్‌పెల్లి రేంజ్ ప్రాంతంలో తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ 11వ బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఎఫ్ఆర్వోలు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావుతో కలిసి బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. కవ్వాల్ అడవుల్లో మైసమ్మకుంట, ఘనిశెట్టికుంట తదితర ప్రాంతాలను పరిశీలించారు. బడ్తాన్‌పేట గ్రాస్ ల్యాండ్‌ను పరిశీలించి గడ్డి క్షేత్రాల పెంపకం గురించి తెలుసుకున్నారు. అడవుల అభివృద్ధికి, స్మగ్లర్ల నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులు వారికి వివరించారు. వన్యప్రాణుల సంరక్షణ, పెద్దపులి అడుగుల గుర్తింపు, అటవీ చట్టాల వినియోగం తదితర అంశాలపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇందన్‌పెల్లి ఎఫ్ఆర్వో హఫీసొద్దీన్ ఉన్నారు.

# గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

**ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస్‌రావు**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 28 : వినాయక చవితి పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గణేశ్ ఉత్సవాల్లో భాగంగా కమిటీలు నిర్వహించే అన్ని కార్యక్రమాలకు బాధ్యత వహించాలన్నారు, మండపాలకి పోలీసుల నుంచి అనుమతి తప్పనిసరి అని, మండపం ఏర్పాటు చేసే స్థలం యజమాని నుండి అనుమతి తీసుకోవాలని, సాంస్కృతిక కార్యక్రమాల పేరిట రికార్డు డ్యాన్సులు, అనైతిక ప్రదర్శనలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



ర్యాలీ తీస్తున్న వీవోఏలు

# సమస్యలు పరిష్కరించాలి

- ఐకేపీ వీవోఏల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నస్పూర్, ఆగస్టు 28 : సమస్యలు పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ముందు ఉద్యోగుల సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు రహదారి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ వీవోఏలకు నెలకు రూ. 26 వేల వేతనం చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమార్, రాము, వెంకటేశ్, పోశం, సమ్మన్న, లక్ష్మణ్, బీంరాజ్, వెంకటి, మహేశ్, తుకారం, లక్ష్మీనారాయణ, లావణ్య, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679